# రాక్షసి

కమలాగిరి

"ఏం అప్పుడే అయిపోయిందా సంచారం. థు, బోగబడోడా! సన్యాసోడా! ఎప్పుడూ యిండ్లిండ్లు బసవరాలాకట్ల తిరుగుతుంటాడు మీ వంశమే అట్లాది. ఎప్పుడూ ఎబవలకి శాకిరిసేయడమే. యిండ్లిండ్లూ తిరిగేకన్నా రాత్రి వానకి మిద్దిమీద అంత బొంగపడిందిగదా యింత మన్ను తెచ్చిపోసేవాళ్లులేరు. మీయప్ప ఖజానా వుందనికోయింటివా బాడుగ బండిపెట్టి తోలించేకి. మీరేం మొగోళ్లు అయితేగదా సంసారం కాబట్టేది? ఇగో పోయినాడుసూడు మీనాయిన తెల్లారుజాంకాడ ఎబవశాకిరి చేసేదానికి, వానికి దుడ్లతో అవుసరముంటే వాడేపోయి తెచ్చుకుంటాడు, ఏం మనపని యిడిసిపెట్టి పోవల్లని ఆరేడుమైళ్లునడిచి. ఏం వాళ్ళ మొగలాయి దర్బారూని! యిట్ల యిట్ల షవ్వమ్మా షవ్వమ్మాని ఉంటే నెత్తికెక్కి కూచుంటారు. ఇగో పొద్దున యింటిపైకి వచ్చిన్రిసూడు మీసాలున్న మొగోల్లాకట్ల, కోడి మనం తిన్నామంటా. లంజాకొడుకులు. మనకోళ్ళే సింపించుకొని మల్ల మనపైకేవచ్చినారు. వాళ్ళు అన్ని అంటావుంటే వొక్కమాటైనా మాట్లాడినావా! సిగ్గు శరమూ, మానము పాణము ఉంటేగదా! మీరేం మొగాళ్ళయితేగదా! రేపొద్దున్న అమ్మగారిని; పెండ్లాండ్లని పబ్లీకుగా పక్కలోకి యీడ్చుకునాత్రి అడిగే లంజాకొడుకులు కాదుమీరు. థు. ఇంక యియ్యప్పకి పెండ్లాం కావాలంట పెండ్లాం దాని బతుకు నాశనం చేసేదానికి- పెండ్లాలు లేసిపోయినారంటే లేసిపోరూ మల్ల- ఎంతో పైసంగా సంసారం గడుపుకొని యింత మెనకేసుకుంటూ వస్తే అంతా ఎబవలకి ముండమోయించాడు- 'మంచోడురబ్బా' అంటేసాలు. ఉబ్బేది యిచ్చేది. ఉబ్బేది యిచ్చేది. యిప్పుడుసూడు తామది ఎంగిలి ఉముసుమన్నా ఉముస్తారేమోసూడు. ఆకిరీకి ముసలి ముప్పున ఎంతకష్టం తెచ్చిపెట్టినాడు సూడు" అంటూ రొట్టె వేసేటప్పుడు పెనుముమీదపడిన కన్నీరు వేడి పొగలను రేపింది. "ఉ, గతుకు గతుకు పాపం ఊర్లోళ్ళపని నిలిచిపోదూ, మొగాడయినంకా రోషంగా బతకాలి. బతుకుతుంది గద్దా. కాకి."

అంతలో ఒకడు ఇంట్లోకి దూరాడు, వానివెంట గుంపొచ్చింది, "తుడుగు లంజా! మా కోడినేతివి మమ్మల్నే తిడుతావా?" అంటూ ఆమని బర్రినియీడ్చి దబదబ కొట్టాడు.

చెప్పకుండా ఉండలేను. చెబితే అసహ్యం. అశ్లీలమంటూ నిజాన్ని కప్పిపుచ్చమంటారు మీరు. నేనలా చేయలేను. నిజాన్ని దాచలేను

ఆమె వాని ఇజాలను (మర్మాంగాలను) చేతులతో బిర్రిగా పట్టుకుంది. వాడు విలవిల తండ్లాడుతున్నాడు. ఆమె చేతులుతీయాలని గిచ్చాడు. కొరికాడు వాని ప్రాణాలు పోయేవరకు చేతులు బిగువు సడలలేదు. సిగ్గిచచ్చాడు. అంతా ఆమెను 'రాక్షసి' అన్నారు.

కావచ్చు. మనిషిగా బ్రతకటమే రాక్షసత్వం అయితే ఆమె రాక్షసే.

---

బూర్జువా సమాజంలో క్రియాశూన్య వేదాంతం చెప్పేవాడు కేవలం ఆలోచనలలోనే జీవిస్తూ, భౌతికసత్యాల్ని యధార్థజీవిత స్వభావాన్ని, మానవుడి సామాజిక సంబంధాల్ని ఎరుగనివాడై వుంటాడు లేదా పచ్చిమోసగాడూ, స్వార్థపరుడూ, సోమరిపోతూ అయినా అయి వుంటాడు.

—విజయ్

---

వచ్చే సంచికలో

కథలు:

చైతన్యం ఆర్. వి. ఆనంద్.

జనం శ్రీపతి

తెలుగులో సీరియల్ నవలలు

—పురాణం సుబ్రహ్మణ్య శర్మ

దాశరథి రంగాచారి నవల మోదుగుపూలు

సమీక్ష 'రహి'

వచ్చే సంచిక నుంచి

సీరియల్ సమీక్షావ్యాసం

భారతీయ తత్వ శాస్త్రము — ఒక పరిశీలన

—నిమ్మగడ్డ వెంకటేశ్వరరావు